
వన సంపదకు రక్షణ ఏదీ..?

- స్మగ్లర్ల వేటుకు అంతరించిపోతున్న అడవులు
- వణ్యప్రాణులకూ కానరాని రక్షణ
- వేటగాళ్ల ఉచ్చులకు బలవుతున్న పులులు
- ఎస్టీపీఎఫ్ ఏర్పాటుకు కలగని మోక్షం
- సీసీ కెమెరాలున్నా ఆగని వేట



మంచిర్యాలలో చిరుత హంతకులను మీడియా ఎదుట హాజరుపరిచిన అటవీశాఖ అధికారులు (ఫైల్)



మంచిర్యాలలో ఉచ్చులో చిక్కి మరణించిన చిరుతపులి (ఫైల్)

మంచిర్యాల, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అటవీ సంపదకు రక్షణ లేకుండా పోయింది. స్మగ్లర్ల గొడ్డలి వేటుకు అడవులు అంతరించిపోతుండగా, వణ్య ప్రాణులకూ రక్షణ కరువైంది. ఒకప్పటి ఆదిలాబాద్ జిల్లా దట్టమైన అడవులకు పెట్టింది పేరు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఆయా ప్రభుత్వాల నిర్లక్ష్యం, కొందరు అటవీ అధికారుల పట్టింపులేని తనంతో అత్యంతవిలువైన కలపస్మగ్లర్ల గొడ్డలివేటుకు కరిగిపోతుండగా, వణ్యప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. వన సంపద రక్షణకు ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తు న్నా ఆశించిన స్థాయిలో ఫలితం ఉండటంలేదు.

అటవీ విస్తీర్ణం ఇలా...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో మొత్తం 7,101.30 చదరపు కిలోమీటర్ల మేర అడవులు విస్తరించి ఉన్నాయి. ఆదిలాబాద్ డివిజన్‌లో 1898.95 చదరపు కిలోమీటర్లు, బెల్లంపల్లి డివిజన్‌లో 1524.39, జన్నారం డివిజన్‌లో 643.74, కాగజ్‌నగర్ డివిజన్‌లో 893.29, మంచిర్యాల డివిజన్‌లో 1115.37, నిర్మల్ డివిజన్‌లో 1025.16 చదరపు కిలోమీటర్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. ఇక్కడి కలపకు మంచి డిమాండ్ ఉండటంతో స్మగ్లర్ల కన్ను వాటిపై పడి క్రమేపీ అడవులు పలుచబడుతున్నాయి. మంచిర్యాల జిల్లాలో లక్షా 76వేల హెక్టార్లలో అడవులు విస్తరించి ఉండగా, అటవీ అధికారులు వీటిని 195బీట్లుగా విభజించి సంరక్షిస్తున్నారు. ఇందుకోసం ఏటాకోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా స్మగ్లర్ల ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు. దీనికితోడు వేటగాళ్ల మాంసం, చర్మం, గోళ్లకోసం వన్యప్రాణులను విచ్చలవిడిగా వేటాడుతు న్నారు. ఉమ్మడి జిల్లాలో పెద్దపులులు, చిరుతలు మృత్యువాతపడ్డ సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. అడవుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి పులులు, చిరుతల సంచారాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తున్నా అవేవీ ఫలితాన్ని ఇవ్వ డంలేదు. కేవలం వణ్యప్రాణుల గణనకు మాత్రమే సీసీకెమెరాలు ఉపయోగపడుతున్నాయి.

గాల్లో కలుస్తున్న ప్రాణాలు....

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పులులు, చిరుతల ప్రాణాలు గాల్లో కలుస్తున్న సంఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయి. అటవీ ప్రాంతాల్లో విద్యుత్ కంచెలు, ఉచ్చులు ఏర్పాటుచేసి వణ్యప్రాణులను యథేచ్ఛగా వేటాడుతున్నారు. ఇటీవల కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పులిని వేటాడిన స్మగ్లర్లు దాని చర్మం, గోళ్లు తీసుకొని పాతిపెట్టారు. అటవీ అధికారులు విచారణ జరిపి 16మందిని అరెస్టు చేశారు. అటవీ అధికారుల నిఘా లోపం కారణంగానే వన్య ప్రాణులు మృత్యువాత పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఐదేళ్ల కాలంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు పులులు, చిరుతలు మృత్యువాతపడ్డ సంఘటనలు చోటు చేసుకున్నాయి. మంచిర్యాల నగరశివారు క్వారీ గుట్టల్లో ఏదులు, కుందేళ్లు, సాంబారు, నీలుగాయిలు ఎక్కువగా సంచరించే వీలున్నందున... మిగతా 5లో

కాంగ్రెస్ అఫైర్స్ కమిటీలో పీఎస్సార్‌కు చోటు



మంచిర్యాల, మే 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుకు చోటు లభించింది. పొలిటికల్ అఫైర్స్, అడ్వైజరీ, డిలిమిటేషన్, రాజ్యాంగ పరిరక్షణ, అనుశాసన కమిటీల ఏర్పాటుపై ఏఐసీసీ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో వాటిని వెంటనే అమలు చేయనుంది. తెలంగాణ కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుతో సహా 22 మంది సభ్యులు నియమితులయ్యారు.

ఫెర్టిలైజర్ డీలర్లకు శిక్షణ కార్యక్రమం



మిషన్లను అందజేస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి కల్పన

నస్పూర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలోని సీతారాంపల్లి రైతు వేదిక వద్ద మంచిర్యాల డివిజన్ స్థాయిలో ఫెర్టిలైజర్ డీలర్లకు శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో నస్పూర్, హాజీపూర్, లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండ లాల్లో ఎరువులు అమ్మే డీలర్లకు ఈ-పాస్ ఎల్-1 కొత్త మిషన్ల పని తీరుపై అవగాహన కల్పించారు. అనంతరం ఆ మిషన్లను డీలర్లకు అందజేశారు. డీలర్లు ఈ-పాస్‌తో రైతులకు ఆధారుకార్డు ఆధారంతో వ్యవసాయ భూమిపంటల వారిగా ఫెర్టిలైజర్‌ను ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి కల్పన, డివిజన్ అధికారి అనిత, డివిజన్‌లోని వ్యవసాయ శాఖ అధికారులు ఎస్‌పీఐసీ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాలకు సంక్షేమఫలాలు అందిస్తాం

భీమారం, మే 30(ఆంధ్రజ్యోతి) : సబ్బండ వర్గాలకు ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేస్తానని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రె స్ ప్రభుత్వం ఏర్పాటులో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉందన్నారు. యువతను ప్రభు త్వం ఆదుకునేందుకు వారికి ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. మండలలో 762 మంది రాజీవ్ యువ వికాసంలో దరఖాస్తులు చేసుకోగా ఇప్పటికే 200-62 యూనిట్లకు అధికారులు ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారన్నారు.

ముందుగా రూ. 50 వేల నుంచి లక్ష వరకు దరఖాస్తు చేసుకున్న వారికి జూన్ 2న మంజూరు పత్రాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు చేకుర్తి సత్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచులు రాంరెడ్డి, రమేష్, నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్‌రాజు పాల్గొన్నారు.

సింగరేణి స్థలాల్లో నివాసం ఉంటున్న వారికి శాశ్వత ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

- కలెక్టరేట్ ఎదుట బీజేపీ ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

నస్పూర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలోని సింగరేణి స్థలాల్లో చాలా కాలంగా నివాసం ఉంటున్న వారందరికి శాశ్వత ఇళ్ల పట్టాలను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అంతకు ముందు ప్రధాన రహదారి కమాన్ వద్ద నుంచి ఊరేగింపుగా కలెక్టరేట్ ప్రధాన ద్వారం వరకు చేరుకున్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, మాజీ అధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్ మాట్లాడుతూ చాలా కాలంగా సింగరేణి స్థలాల్లో ఇండ్లను నిర్మించుకొని నివాసముంటున్నారని, వారందరికి ఇళ్ల పట్టాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలకు శాశ్వత పట్టాలను ఇవ్వాలన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీలు గుప్పించి పేద ప్రజలు మోసం చేస్తున్నారన్నారు. వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరికి పట్టాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీజేపీ నాయకులు పురుషోత్తం, క్రిష్ణమూర్తి, కమలాకర్‌రావు, సామ్రాజ్ రమేశ్, సత్రం రమేష్, రవనవేని శ్రీనివాస్, పొన్నవేని సదానందం, మిట్టపల్లి మొగిలి, చక్రి, విక్రం, శ్రీకాంత్, అశ్విన్, రాజుకుమార్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వ్యవసా యకార్మిక సంఘం నాయకులు

నస్పూర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధి హామీ పథకం కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే. అశోక్ డిమాండ్ చేశారు. నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అదనపు కలెక్టర్ మోతిలాల్ అంద జేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఉపాధి హామీని పట్టణ ప్రాంతాలకు విస్తరించి కూలీలకు అవకాశం కల్పిం చాలన్నారు. ప్రతి కుటుంబానికి 200 పని దినాలను కల్పించి కూలీ 600 చొప్పున చెల్లించాలని, వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసారు. జాబుకార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రూ. 12 వేల రూపాయలు ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ కూలీ పని స్థలంలో ప్రమాదాలకు గురైతే ఉచిత వైద్యం, ఒక వేళ చనిపోతే ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అశోక్, చందు, రాజేశ్వరి, కావిరి రవి, రాజలింగు, సమ్మక్కలతో పాటు దండేపల్లి, జన్నారం, చెన్నూర్ కూలీలు పాల్గొన్నారు.

దోస్త్ అడ్మిషన్‌లు ప్రారంభం

చెన్నూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిష్టంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ అడ్మిషన్‌లు ప్రారంభ మ య్యాయని, ఫేజ్ 2 అడ్మిషన్‌లకు జూన్ 13 చివరి తేదీ అని కళాశాల ప్రిన్సిపల్ ఎంవీ పట్వర్ధన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలి పారు. ప్రవేశాల కోసం విద్యార్థులు అవసరమైన పత్రాలు తగిన రుసుముతో కళాశాలలో సంప్రదించాలన్నారు. విద్యార్థుల కోసం కళాశాలలో దోస్త్ హెల్ప్‌లైన్ సెంబర్ ఉందన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీజెడ్‌సీ, ఎంపీసీ బీజెడ్‌సీ, ఎంపీసీఎస్ గ్రూపులు ఉన్నాయన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేషన్ బియ్యం సకాలంలో పంపిణీ చేయాలి

- అదనపు కలెక్టర్ మోతిలాల్

మంచిర్యాలకలెక్టరేట్, మే30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రేషన్ బియ్యం పంపిణీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లో సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ చాంబర్‌లో డీసీఎస్‌వో బ్రహ్మారావుతో కలిసి రేషన్ డీలర్లు ఈ పాస్ ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడు తూ ప్రస్తుత అకాల వర్షాల పరిస్థితుల దృష్ట్యా రాబోయే మూడు నెలల కాలంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తోందని తెలిపారు. ఈ క్రమంలో రేషన్ డీలర్లు తమ దుకాణాల వద్ద సమయపాలన పాటించి ప్రతి ఒక్కరికీ రేషన్ బియ్యం అందే విధంగా చూడాలన్నారు. రాష్ట్ర, జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తారని రేషన్ డీలర్లు స్టాక్ నిల్వలు చౌకదరల దుకాణాల నంబర్ డీలర్‌పేరు, మొబైల్ నంబర్, రేషన్‌షాపు, నిర్వహించే సమయం పూర్తి వివరాలతో నోటీసు బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎం శ్రీకళ, అధికారులు, ఈ పాసు ఇంజనీర్లు పాల్గొన్నారు.

గుర్తింపు సంఘం ఎన్నికల్లో విక్రమ్‌రావు గెలుపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు

బెల్లంపల్లి, మే30 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో విక్రమ్‌రావును గెలిపించాలని ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వివేక్, వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ దేవాపూర్ సిమెంట్ కంపెనీ ఎన్నికల్లో ఆదివాసీలు ఎక్కువగా ఉన్నారని ప్రతి ఒక్కరు యూనియన్ అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న విక్రమ్‌కు చేయూతనిచ్చి గెలుపునకు కృషి చేయాలన్నారు. గడ్డం వెంకటస్వామి, కాకా కుటుంబం నాటి నుంచి కార్మికుల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. సింగరేణి కార్మికులకు పెన్షన్‌తో పాటు ప్రావిడెంట్ ఫండ్ సాధించడంలో కాకా వెంకటస్వామి కృషి మరువలేనిదన్నారు. మూతపడే స్థితిలో ఉన్న సింగరేణిని కాపాడింది కాకా కుటుంబమే అని పేర్కొన్నారు. రానున్న దేవాపూర్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో విక్రమ్‌రావుకు ప్రతి ఒక్కరు మద్ధతు పలికి గెలిపించుకోవాలన్నారు. కార్మికుల హక్కుల కోసం సంక్షేమం కోసం ఎల్లవేళలా ముందుంటామని, గుర్తింపు సంఘం ఎన్నికల్లో విక్రమ్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ విక్రమ్‌రావు, కాసిపేట మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, నాయకులు రమేశ్, దావ రమేశ్‌లు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో స్ట్రక్చర్ సమావేశం

శ్రీరాంపూర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏఐటీయూసీ యూనియన్ నాయకులతో ఏరియా జీఎం శ్రీనివాస్ స్ట్రక్చర్ సమావేశం ఏర్పాటు చేశారు. వారి ద్వారా అందిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా నని హామీ ఇచ్చారు. ఆయా సమస్యలు పరిష్కరించే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, శ్రీరాంపూర్, ఇందారం ఓసీపీల పీవోలు టి. శ్రీనివాస్, ఏవీరెడ్డి, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, డీజీఎంలు అరవిందరావు, ఆనంద్ కుమార్, రవీందర్, డిప్యూటీ సీఎంఓ డాక్టర్ పి. రమేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి

- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



చెన్నూరు బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

చెన్నూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. చెన్నూరు పట్టణంలో రూ. 13 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన బస్తీ దవాఖానా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీలోని ప్రజలకు మెరుగైన వైద్య అందించాలని బస్తీ దవాఖానాను ప్రారంభించామన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి నియోజకవర్గంలోని ప్రజల వైద్యంపై దృష్టి సారించానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

- కలెక్టర్ కుమార్ దీపక్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలకలెక్టరేట్, మే30 (ఆంధ్రజ్యోతి): ప్రజలతో మమేకమై సేవలు అందించే ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసి ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసం చాలకులుగా పని చేస్తూ ఈ నెల 31వ తేదీ పదవీ విరమణ పొందుతున్న నేపథ్యంలో పోటు రవీందర్ రెడ్డి దంపతులను జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా అధికారులతో శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోటు రవీందర్ రెడ్డి విధులలో నిబద్ధతతో సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని, పదవీ విరమణ పొందిన అనంతరం శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధశాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

దేవాపూర్ ఓరియంట్‌లో ఎన్నికల సందడి

- జూన్ 5న గుర్తులు కేటాయింపు
- నెలాఖరున గుర్తింపు సంఘం ఎన్నికలు

5

జోరుగా నాటుసారా తయారీ

- మారుమూల ప్రాంతాల్లో అడ్డాలు
- అధికారులు దాడులు చేస్తున్నా మారనితీరు

4

ఉద్యమకారులకు మునీర్ జీవితం స్ఫూర్తిదాయకం

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



మునీర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

మంచిర్యాలకలెక్టరేట్, మే30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుకు సీనియర్ జర్నలిస్టు మునీర్ జీవితం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని గౌతమినగర్‌లో మునీర్ నివాసానికి చేరుకొని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మునీర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో జర్నలిస్టుగా కీలక పాత్ర పోషించారని కొనియాడారు. మునీర్ కుటుంబసభ్యులు మాట్లాడిన అం శాలు పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకెఎస్ నాయకులు మిరియాల రాజిరెడ్డి, సురేందర్‌రెడ్డి, ప్రకాశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

- ఎమ్మెల్సీ కవిత మంచిర్యాల పర్యటన సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులతో పాటు అనుబంధ సింగరేణి కార్మిక సంఘం టీబీజీకేఎస్ నాయకులు ఆమె వెంట లేకపోవడం చర్చకు దారి తీసింది.
- కాళేశ్వర పుష్కరాల సందర్భంగా ఎంపీ వంశీని కార్యక్రమానికి ఆహ్వానిం చక పోవడంపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విచారం వ్యక్త చేశారు. కేవలం కులాల, మతాల ప్రాతి పదికన రాజకీయాలు చేయవద్దన్నారు. ఆపరేషన్ కగార్ ద్వారా నరమేధానికి పాల్పడుతుందని విమర్శించారు.

నస్పూర్‌లో పరామర్శ...

నస్పూర్ : జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శుక్రవారం నస్పూర్ పట్టణంలో పర్యటించారు. నస్పూర్ కాలనీ లోని తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాల లు వేసి నివాళులు అర్పించారు. జాగృతి జిల్లా నాయకులు కందుల ప్రశాంత్ ఇంటికి వెళ్లి ఆయన్ని పరామర్శించారు. రాజకీయ నాయకుల ఒత్తిడి వలన ప్రశాంత్‌పై కేసు నమోదు కాగా ఆయన్ని, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

లక్షెట్టిపేట: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పట్టణ కేంద్రంలో శుక్రవారం కార్య కర్తలను ఆత్మీయంగా పలకరించారు. జిల్లా కేంద్రంలో జరిగిన ఒక వివాహానికి హాజరై వెళ్తుండగా జాగృతి నాయకురాలు తెలంగాణరాష్ట్ర నర్సింగ్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి అయిన బానాల నిషలెనిన్ నివాసంలో కాసేపు కార్యకర్తలతో పాటు మహిళలతో ముచ్చటించారు.

శ్రీరాంపూర్: ఎమ్మెల్సీ కవిత శుక్రవారం మంచిర్యాలకు వెళ్తూ శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద ఆగారు. కారు దిగి తన అభిమానులకు అభివాదంచేసి, తిరిగి కారెక్కారు. ఆమె అభిమానులు పూలు చల్లుతూ, పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అక్కడికి తెలంగాణ జాగృతి నాయకులుగానీ, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) నాయకులుగానీ రాలేదు. ఆమెకు స్వాగతం పలుకలేదు.

బాలికల సంరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ఆసిఫాబాద్‌రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): బాలికల సంరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని డీఈవో యాదయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రజ్వల స్వచ్ఛంద ఆధ్వర్యంలో కేజీబీవీ, మోడల్ స్కూల్, అర్బన్ రెసిడెన్షియల్ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం డీఈవో యాదయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్ణయించే స్థాయికి ఆడ ప్లిలలు ఎదగాలని అన్నారు. అందు కోసం ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కాని దురదృష్టవశాత్తు కొంత మంది అసాంఘిక కార్యకపాలకు ఉపయోగిస్తూ వారి జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. పాఠశాలల్లో చదువుతో పాటు మానవతా విలువలు కూడా నేర్పించాలని సూచించారు. మైనర్లకు వ్యక్తి గత శుభ్రత, శరీర పెరుగుదల మార్పులు దాని పర్యావసనాల గురించి వివరించి పేరెంట్, టీచర్స్ మీటింగ్ కండక్ట్ చేసినప్పుడు పర్సనల్ విషయాలను చర్చించాలని అన్నారు. అలాగే బాల్య వివాహాలను నిరోధించాలని, లైంగిక దాడి బాధితులకు ప్రభుత్వం కల్పించే సదుపాయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జీసీడీవో శిక్షణ కోర్సు కో ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి, ప్రజ్వల స్టేట్ కో ఆర్డినేటర్ మహ్మద్ సిరాజ్, అనీల్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

పెంచికలపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని డీసీపీవో మహేష్ అన్నారు. మండల కేంద్రంలోని చెడ్వాయి గ్రామ కొత్తగూడెం కాలనీకి చెందిన మైనర్‌కు వివాహం చేస్తున్నారనే సమాచారంతో కుటుంబ సభ్యులకు శుక్రవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బాల్య వివాహాలు చేస్తే రెండు సంవత్సరాల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించే అవకాశం ఉందని చెప్పారు. 2030 వరకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించినటువంటి బాల్య వివాహ రహిత భారత్ లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఎక్కడైనా బాల్య వివాహం జరిగితే టోల్ ఫ్రీ నంబరు 1098, 112లకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ బాల ప్రవీణ్ కుమార్, కౌన్సిలర్ రవళి, సూపర్‌వైజర్ హసీనా, పోలీసులు సురేష్, సాయిలత పాల్గొన్నారు.

దరఖాస్తు తేదీ పొడిగింపు


ఆసిఫాబాద్‌రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తు తేదీని జూన్ 30 వరకు పొడిగించినట్లు షెడ్యూల్‌కులాల అభివృద్ధి అధికారి సజీవన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, సీబీ, మైనార్టీ విద్యార్థులు(ఫ్రెష్, రెన్యూవల్) కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వాహనాల తనిఖీ

దహెగాం, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లగ్గాం క్రాస్ రోడ్డు వద్ద ఎస్సై విక్రమ్ శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహన ధ్రువపత్రాలు లేనివానికి, హెల్మెట్ ధరించని వారికి ఎస్సై జరిమానా విధించారు.

జోరుగా నాటు సారా తయారీ

● మారుమూల ప్రాంతాల్లో అడ్డాలు ● అధికారులు దాడులు చేస్తున్నా మారనితీరు



కాగజ్‌నగర్, మే 30 (ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతాల్లో నాటు సారా తయారీ జోరుగా సాగుతోంది. అటవీ, మారుమూల ప్రాంతాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకుని కుటీర పరిశ్రమలా వ్యాపారం చేస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు దాడులు చేస్తున్నా నాటుసారా తయారీదారులు ఏమాత్రం తగ్గడం లేదు. సిర్పూరు నియోకజవర్గంలో పలు గ్రామీణ ప్రాంతాల్లో గుడుంబా గుప్పుమంటోంది. రాష్ట్ర ప్రభుత్వం నాటు సారా, గుడుంబా దందాలపై ఉక్కు పాదం మోపి పూర్తి స్థాయిలో కన్పించకుండా చేస్తున్నప్పటికీ మాత్రం సిర్పూరు నియోజకవర్గంలోని సిర్పూరు(టి), కౌటాల, బెజ్జూరు, పెంచికల్‌పేట, కాగజ్‌నగర్, దహెగాం మండలాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఈ దందాను యథేచ్ఛగా నడిపిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు, పోలీసులు దాడులు తరుచూ నిర్వహిస్తున్నప్పటికీ అడ్డుకట్ట పడడం లేదు.

మద్యం ధరతో పోల్చితే..

మద్యం ధరతో పోల్చితే చవక కావడంతో మందుబాబులు నాటుసారా సేవిస్తున్నారు. కాగా నాటు సారా తయారీలో హానికరమైన పటికతో పాటు మత్తునిచ్చే రసాయనాలు వినియోగిస్తున్నారు. నల్లబెల్లం మిశ్రమాన్ని డ్రమ్ములో కలిపి ఊటను తయారు చేస్తారు. దాన్ని 10రోజులు ఇలానే ఉంచుతారు. తర్వాత బెల్లం ఊటను కుండలో పోసి మంట పెడుతారు. బెల్లం ఊట మరిగి వచ్చి న ఆవిరి చుక్కలు పైపు ద్వారా బయటకు వచ్చేలా ఏర్పాటు చేస్తారు. అలా వచ్చిన ఆవిరి చుక్కలే నాటుసారా. ఇలా తయారు చేసిన నాటు సారా తాగిన వారు అనారోగ్య సమస్యలకు గురవుతు న్నారు. అధికారులు అవగాహన కల్పిస్తున్నా నాటు సారా తయారీని అక్రమార్కులు కొనసాగిస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోనే అధికంగా..

సిర్పూరు నియోజకవర్గంలోని కౌటాల, బెజ్జూరు, పెం చికల్‌పేట, దహెగాం, కాగజ్‌నగర్ మండలాల్లోని పలు ప్రాంతాల్లో ఈ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. గతంలో కంటే అత్యాధునికంగా వంటలకు ఉపయోగించే గ్యాస్ సిలిండర్లు, వివిధ పరికరాలను ఉపయోగించి గుడుంబాను తయారు చేస్తున్నారు. ప్రధానంగా నదీ పరివాహక ప్రాంత సమీపంతో పాటు ఎవరికి అంతు చిక్కకుండా ఉండే పొలాల్లో తయారు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. ప్యాకెట్లలో అతి తక్కువ ధరకు అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో నిరుపేద కూలీల జీవితాలతో చెలగాటం ఆడినట్లవుతోంది. అయితే ఎక్సైజ్ అధికారులు కూడా తరుచూ సమగ్ర స్థాయిలో నివేదికలు రూపొందించుకుని పక్కా సమాచారం దాడులు నిర్వహిస్తున్నప్పటికీ కూడా ఈ దందాకు మేరకు అడ్డుకట్ట పడడం లేదు.

తాజాగా పోలీసులు సైతం నాటు సారా స్థావరాలపై దాడులు చేసి నిర్వాహకులపై కేసులు కూడా నమోదు చేశారు. సిర్పూరు నియోజకవర్గం లోని పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తగా దాడులు నిర్వహించి పది కేసులు నమోదు చేశారు. గుడుంబా విక్రయిచిన వారిపై కేసులు నమోదు చేసిన కూడా మళ్లీ ఈ దందాను కొనసాగిస్తే తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్నారు. ఇప్పటికే పలువురికి జరిమానా విధించా రు. అయినా కూడా ఈ దందా గ్రామీణ ప్రాంతాల్లో నడుస్తోంది. ఉన్నతా.ధికారులు స్పందించి గుడుంబా దందాను పూర్తి స్థాయిలో అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విష యమై ఎక్సైజ్ సీఐ రవికుమార్‌ను వివరణ కోరగా గుడుంబా అమ్మకాలపై పూర్తి స్థాయి లో దృష్టి సారించామని, అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



కౌటాలలో స్వాధీనం చేసుకున్న బెల్లం పానకం(ఫైల్)

పశువులు వ్యాధుల బారిన పడకుండా
జాగ్రత్తలు పాటించాలి

● భవిత, పశువైద్యాధికారి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: వర్షాకాలంలో పశువులు వ్యాధుల బారిన పడకుండా పోషకులు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

పశువైద్యాధికారి: వర్షాకాలంలో పశువులు వ్యాధుల బారిన పడకుండా పోషకులు జాగ్రత్తలు పాటించాలి. వర్షాకాలంలో పశువులకు పాదముఖ వ్యాధి, హీమరాజిక్ సెప్టిసీ మియా, మస్టీటిస్ వస్తాయి. దీంతో క్రమంగా ఉండే పురుగులు తినడం తగ్గిపోవడం, వాంతులు, ఉబ్బసం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ఆంధ్రజ్యోతి: వర్షాకాలంలో పశువులకు ఎందుకు ఎక్కువ వ్యాధులకు లోనవుతాయి?

పశువైద్యాధికారి: అధిక తేమవల్ల బ్యాక్టీరియా, ఫంగస్ పెరుగు తాయి, కాలుష్యమైన నీరు, ఆహారం, నీటి నిలువలలో దోమలు, పురుగులు పెరుగుతాయని, ఎత్త, తడి పరిసరాలవల్ల చర్మ వ్యాధు లు సోకుతాయి.

ఆంధ్రజ్యోతి: వ్యాధుల నివారణకు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

పశువైద్యాధికారి: వర్షాకాలంలో పశువులు వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా టీకా వేయించాలి. ఆహారం, నీరు శుభ్రంగా ఇవ్వడం, షెడ్లు శుభ్రంగా ఉంచడం, నీరు నిలువ ఉండకుండా చూడడం వంటివి చేయాలి.

ఆంధ్రజ్యోతి: పశువులకు ఎలాంటి టీకాలు వేయాలి?

పశువైద్యాధికారి: పశువులకు వర్షాకాలంలో ఎఫ్ఎండీ టీకా, హెచ్ఎస్ టీకా, బ్లాక్ క్వార్టర్ టీకా, లోపలి పురుగు నివారణ టీకా, వ్యాధుల నివారణ కోసం ఔషధాలు ఇవ్వాలి.

- సిర్పూర్(టి), ఆంధ్రజ్యోతి

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



సిర్పూర్(టి)లోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, జిల్లా సహకారిశాఖ అధికారి బిక్కు, డివిజన్ వ్యవసాయధికారి మనోహర్

సిర్పూర్(టి), మే 30 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లాతో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుంచి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో ధాన్యం కొనుగోలులో జాప్యం లేకుండా సమయాన్ని ఆదా చేసుకుంటూ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యంను వెంటనే కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అవసరమైన టార్పాలీన్ కవర్లు అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచిచారు. కొనుగోలు కేంద్రాల నుంచి వరి ధాన్యాన్ని తరలించేందుకు వాహనాలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం మండలంలోని దుబ్బగూడ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. వారి వెంట జిల్లా సహకార శాఖ అధికారి బిక్క, కాగజ్‌నగర్ డివిజన్ వ్యవసాయాధికారి మనో హర్, తహసీల్దార్ రహీముద్దీన్ ఉన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన ప్రకారం రైస్ మిల్లలకు తరలించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లాలోని కౌటాల మండలం సాండ్‌గాం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లాతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొన్న అకాల వర్షాల పరిస్థితిలో రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. రైస్ మిల్లర్లు మిల్లుకు వచ్చిన వాహనాల నుంచి ధాన్యాన్ని తక్షణమే దిగుమతి చేసుకుని వాహనాలను తిరిగి పంపించే విదంగా సహకరించాలని అన్నారు. అనంతరం పారెపల్లి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, తహసీల్దార్ ప్రమోద్, ఏపీఎం ముక్తేశ్వర్, జిల్లా సహకార అధికారి బిక్క, నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

వైన్స్‌లో చోరీకి పాల్పడ్డ నిందితుడి అరెస్టు

నస్పూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద ఏఎస్ఆర్ వైన్స్‌లో ఈ నెల 21న తాళం పగుల గొట్టి చోరీకి పాల్పడిన ఇద్దరిలో సుల్తానాబాద్‌కు చెందిన కట్ట అన్సర్ ఆలియాస్ షేక్ అన్సర్‌ను పట్టుకున్నట్లు రూరల్ సీఐ ఆకుల అశోక్ తెలిపారు. సీసీసీ కార్నర్ వద్ద గురువారం సాయంత్రం వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా మోటర్ సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని పట్టుకుని విచారించగా వైన్స్‌లో స్నేహితు డైన హేమంత్‌తో కలిసి చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నాడన్నారు. దొంగతనం చేసిన ఇద్దరిలో ఒకరు పట్టుబడగా మరో వ్యక్తి హేమంత్ పరారీలో ఉన్నాడని పేర్కొన్నారు. అన్సర్ నుంచి వెయ్యి రూపాయల నగదుతో పాటు మోటర్ సైకిల్, చోరీకి ఉపయోగించిన ఇనుపరాడును స్వాధీనం చేసుకుని శుక్రవారం కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ అశోక్ తెలిపారు. దొంగను చాకచక్యంగా పట్టుకున్న సిబ్బందిని డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్‌లు అభినందించారు.

కార్మికుల సంక్షేమానికి పోరాటం



మాట్లాడుతున్న సీపీఐ పట్టణ ప్రధానకార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్

రామకృష్ణాపూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఎల్లవేళలా కార్మికుల సంక్షేమానికి పోరాటం చేస్తుందని పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్ అన్నారు. రామకృష్ణాపూర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1925 డిసెంబరు 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన పార్టీ అనేక ఉద్యమాలలో ముందుండి ప్రజల కోసం పని చేసిందన్నారు. జూన్1న పార్టీ పట్టణ 3వ మహాసభలు నిర్వహించనున్నామని చెప్పారు. వాటిని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మిట్టపల్లి పౌల్, పెరిక సంపత్, కమలమ్మ, గాజుల మణమ్మ, దేవానంద్, శంకర్, మొండి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం

కార్మికుల పిల్లల ఉన్నత విద్యకు పెద్దపీట



సింగరేణి పాఠశాల లోగో ఆవిష్కరిస్తున్న జీఎం దేవేందర్

మందమర్రి టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికుల పిల్లల విద్యాభి వృద్ధికి యాజమాన్యం పెద్దపీట వేస్తుందని మందమర్రి జీఎం దేవేందర్ అన్నారు. పట్టణంలోని సింగరేణి పాఠశాల ఆవరణలో పాఠశాల గోల్డెన్ జూబ్లీ లోగో ఆవిష్కరణకు శుక్రవారం ఆయన హాజరై మాట్లాడారు. ఈ పాఠశాలలో ఇప్పటి వరకు 40 వేల మంది చదువుకున్నారని, ఎంతో మంది ప్రపంచ దేశాల్లో స్థిరపడ్డారని చెప్పారు. ఉన్నత హోదాల్లో ఉన్నారని పేర్కొన్నారు. 1970లో పాఠశాల స్థాపించారని తెలిపారు. స్వర్ణోత్సవ లోగోను సింగరేణి సీఎండీ ఆవిష్కరించారని తెలిపారు. స్వర్ణోత్సవ వేడుకలకు దేశ విదేశాల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్యాంసుందర్, ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, పూర్ణచందర్ పాల్గొన్నారు.

జీవన్ ప్రమాణ్ పత్రాలు సమర్పించాలి

శ్రీరాంపూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఉద్యోగులు జీవన్ ప్రమాణ్ పత్రాలు సమర్పించాలని సింగరేణి యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఏటా నవంబరులో సీఎంపీఎఫ్‌కు జీవన్ ప్రమాణ్ పత్రాలు ఇచ్చినట్లయితే పెన్షన్ ఆగిపోయే అవకాశం ఉండదన్నారు. లేనిపక్షంలో జనవరి నుంచి పెన్షన్ నిలిపివేస్తారని అన్నారు. పెన్షన్ పంపిణీ బాధ్యతను 2023 సంవత్సరం నుంచి ఝార్ఖండ్ రాష్ట్రంలోని ధన్‌బాద్‌లో ఉన్న స్టేట్‌బ్యాంక్ ఇండియా వారికి అప్పగించారని తెలిపారు. ఇటీవల కొందరికి పెన్షన్లు నిలిచిపోయాయని, జీవన్ ప్రమాణ్ పత్రం బ్యాంకుకు అందకపోవడం వల్ల ఈ సమస్య తలెత్తిందన్నారు. సమస్యలుంటే సీఎంపీఎఫ్ వారి వాట్సాప్ నంబర్ 9490345763(కొత్తగూడెం), 9866054594(రామగుండం)కు పంపవచ్చని సూచించారు.

కార్మికుల హక్కుల సాధనకు పోరాటాలు

బెల్లంపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కుల సాధనకు అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్నామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐటీయూ పోరాటాల ఫలితంగా దేశంలో అనేక హక్కులను సాధించుకున్నామన్నారు. కార్మిక హక్కుల సాధన కోసం 1970లో సీఐటీయు కార్మిక సంఘంగా ఏర్పడి సమస్యల పరిష్కారానికి ముందుకు వెళ్తుందని తెలిపారు. కార్యక్ర మంలో యాకూబ్, అశోక్, ప్రభాకర్, కమల్, నాగరాజు, రాజమౌళిలు పాల్గొన్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): కాసిపేటగనిపై సీఐటీయూ నాయకులు జెండా ఎగురవేసి ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ జన రల్ సెక్రటరీ నాగరాజు గోపాల్ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఆదర్శవంతమైన కార్మిక సంఘాన్ని నిర్మించి కార్మికుల పక్షాన పోరాడే విధంగా మరింత బలోపేతం చేస్తామన్నారు. అనంతరం యూనియన్ జెండాను ఆవిష్కరించారు. వివిధ యూనియన్ల నుంచి సీఐటీయులో చేరిన వారికి కండువా వేశారు. కార్మికుల డిమాండ్ల సాధనే ధ్యేయంగడా పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మందమర్రి బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్. వెంకటస్వామి, రామగిరి రామస్వామి, వడ్లకొండ ఐలయ్య, జడల ప్రవీణ్, పసునూటి శ్రీకాంత్, దెబ్బటి తిరుపతి, నాగవెల్లి శ్రీధర్, ప్రశాంత్, సయ్యద్ అమీర్ తాజోద్దీన్, బుద్దె సురేశ్, హన్మంతు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణ

సింగరేణి అభివృద్ధిలో ప్రముఖ పాత్ర

శ్రీరాంపూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి అభివృద్ధిలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుది ప్రముఖ పాత్ర అని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు శంకర్‌రావు అన్నా రు. శ్రీధర్‌బాబు జన్మదినం సందర్భంగా ఆర్కే 5 గనిపై కేక్ కట్ చేశారు. స్వీట్లు పంచారు. కార్యక్రమంలో యూనియన్ కేంద్ర నాయ కులు సీహెచ్ భీంరావు, గరిగె స్వామి, జీవన్‌రావు, తిరుపతి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): కాసిపేటగనిపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలను ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బన్న లక్ష్మణ్ దాసు నాయకులు రాజుకుమార్, కనుకుంట్ల దినేష్, పిట్టల శివ, శ్రీకాంత్, రాజుకుమార్, శ్రీనివాస్, అనిల్, రాజేశ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రాలిక్ క్రేన్‌తో ఉపయోగం



యంత్రాన్ని ప్రారంభిస్తున్న జీఎం శ్రీనివాస్, పాల్గొన్న అధికారులు

శ్రీరాంపూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): భూగర్భ, ఉపరితల గనుల్లో హైడ్రాలిక్ క్రేన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో ఆయన 5 కోట్ల 26 లక్షల రూపాయల విలువ గల 75 టన్నుల హైడ్రాలిక్ క్రేన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఉపరితల గనుల్లో ఉన్న షావల్స్, డంపర్లు, సీహెచ్‌పీ మరమ్మతులు, పంపు యంత్రాల స్థానచలనం, వివిధ గనులు విభాగాల్లో భారీ యంత్రాలు, యంత్ర పరికరాలు, విడి భాగాల రవాణాలో క్రేన్‌ను వినియోగించ వచ్చన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ జీఎం(క్వాలిటీ) సుశాంత్ సాహూ, శ్రీరాం పూర్ ఏరియా ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, ఓసీపీ పీవో టి. శ్రీనివాస్, ఏజీఎం(ఫైనాన్స్) టీభత్స, ఇందారం ఓసీపీ పీవో ఏవీరెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్ కార్మికులకు వసతులు కల్పించాలి

శ్రీరాంపూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సులభ్ కాంప్లెక్స్‌ల్లో పనిచేసే కార్మికులకు వసతులు కల్పించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, జీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ, సులబ్ కాంప్లెక్సుల్లో సింగరేణివ్యాప్తంగా 200 మంది విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. ఆయా కార్మికులు నెలలో 30 రోజులు పనిచేసినా వారికి ఉద్యోగ భద్రత లేదన్నారు. ఇతర కాంట్రాక్టు కార్మికుల మాదిరిగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి బీమా సదుపాయం, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని, 8.23 శాతం బోనస్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సింగరేణి సులభ్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి. బ్రహ్మానందం, నాయకులు మల్లేష్, రమేష్, లక్ష్మయ్య, వెంకటేష్, రాజు, విజయలక్ష్మీ, సుగుణ, జ్యోతి పాల్గొన్నారు.

సింగరేణి నిర్ణయంపై రిటైర్డ్ కార్మికుల హర్షం

శ్రీరాంపూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో కార్పొరేట్ ఆస్పత్రి ప్రారంభించాలని సింగరేణి యాజమాన్యం నిర్ణయించడంపై సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రాంచందర్‌రావు, ప్రధాన కార్యదర్శి భూపెల్లి బానయ్య, ఉప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాసిన లేఖను సీఎండీ ఎన్ బలరాంకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో విజయబాబు, నర్సింగరావు, రాజయ్య, ఉమాకర్, కనకయ్య, బీరయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఐ బాధ్యతల స్వీకరణ

లక్షెట్టిపేట, మే 30(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా డి.రమణమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇంత కాలం సీఐగా పనిచేసిన అల్లం నరేందర్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో పూర్తి బాధ్యతలు చేపట్టారు. నూతన సీఐని ఎస్సైలు గోపతి సురేష్, తహసీ యోద్దీన్, రాజవర్ధన్ పూల మొక్కలను అందజేసి స్వాగతం పలికారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీ

తాండూర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు 1వ తరగతి నుంచి 10వ తరగతికి సంబంధించి పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని ఎంఈవో మల్లేశం తెలిపారు. శుక్రవారం తాండూర్‌లోని విద్యా వనరుల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగు ప్రణాళికపై అవగాహన కల్పించాలి

నెన్నెల, మే 30 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం పంట సీజన్ సాగు ప్రణాళికపై రైతులకు అవగాహన కల్పించాలని భీమిని ఏడీఏ సురేఖ అన్నారు. నెన్నెల, వేమనపల్లి, కన్నెపల్లి, భీమిని మండలాల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులకు మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఏడీఏ మాట్లాడారు. రైతులు సాగు ప్రణాళికను తప్పకుండా పాటించేలా చూడాలన్నారు. సీజన్ లో విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. రైతుల వివరాల నమోదు ప్రక్రియను వేగవంతం చేసి ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారులు పుష్పాల సృజన, వీరన్న, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

కోటపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలుగామ గ్రామం నుంచి బొప్పారం వరకు, ఆలుగామ గ్రామం నుంచి లింగన్నపేట వరకు రోడ్డు బాగు చేయించాలని కోరుతూ శుక్రవారం చెన్నూరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామికి జనగామ, ఆలుగామ మాజీ సర్పంచులు గట్టు లక్ష్మణ్‌గౌడ్, సంతోష్ వినతి పత్రం అందించారు. వర్షాకాలం వస్తుండడంతో రోడ్డు సరిగ్గా లేక రైతులు, ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. స్పందించిన ఎమ్మెల్యే రోడ్డు బాగు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు మాజీ సర్పంచులు తెలిపారు.

దేవాపూర్ ఓరియంట్‌లో ఎన్నికల సందడి

- జూన్ 5న ఎన్నికల గుర్తులు కేటాయింపు
- నెలాఖరున గుర్తింపు సంఘం ఎన్నికలు

కాసిపేట, మే30 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ అదాని ఓరియంట్ సిమెంట్ కంపెనీలో ఎట్టకేలకు గుర్తింపు సంఘం ఎన్నికల నగారా మోగింది. దీంతో ఇక్కడ ఎన్నికల వాతావ రణం ఒక్కసారిగా వేడెక్కింది. నెల రోజుల నుంచి మారు తున్న రాజకీయ సమీకరణాలు మరింత హీట్ ఎక్కిస్తున్నాయి. ఏ వర్గం నాయకులు ఎవరికి మద్దతు ఇస్తున్నారో తెలియక కార్మికులు సైతం అయోమయానికి గురవుతున్నారు. ఆదిలాబాద్ లేబర్ కమిషన్ ఆఫీస్ నుంచి ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో దేవాపూర్ ఓరియంట్ సి మెంట్ కంపెనీలో ఎన్నికల సందడి నెలకొంది.

జూన్ 5న కార్మిక సంఘాలతో ఆదిలాబాద్‌లో నిర్వహించే సమావేశం అనంతరం ఎన్నికల గుర్తులు కేటాయించనున్నట్లు అధికారులు నోటీసులో వెల్లడించారు. గుర్తుల కేటాయింపుల అనంతరం రెండు వారాల్లో గుర్తింపు సంఘం ఎన్నికలను నిర్వహించేందుకు కార్మిక శాఖ అధికారులు ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. దీంతో నెలాకరులోగా ఓరియంట్ ఎన్నికలు నిర్వహించేందుకు కంపెనీ అధికారులు, ఆ దిశగా సమీక్షా స మావేశాలు నిర్వహించి బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేస్తు న్నారు. దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో 267 మంది కార్మికులు ఉండగా ఆదివాసి కార్మికులు 136 మంది ఉన్నారు. వీరి మద్దతు కూడ గట్టుకున్నవారికే విజయం వరించనుంది. ఇక్కడ ఆదివాసీ ఓట్లు క్రియాశీలకంగా మారనున్నాయి.

ఆరేళ్ల తరువాత గుర్తింపు సంఘం ఎన్నికలు...

రెండేండ్ల కాలపరిమితితో నిర్వహించాల్సిన గుర్తింపు సంఘం ఎన్నికలకు ఆరేళ్లకోసారి నిర్వహిస్తున్నారు. దీంతో కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర జాప్యం జరిగి కార్మికులు అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2019 అక్టోబర్‌లో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికలకు మళ్లీ ఈ ఏడాదికి మోక్షం లభించింది. దీనిపై గుర్తింపు సంఘం మాజీ అధ్యక్షులు రాములు నాయక్ కోర్టుకు వెళ్లి ఎన్నికల కోసం పోరాడితేగాని ఎన్నికల నిర్వహణ జరుగడం లేదు. ఇప్పటికైన ఎన్నికలు సజావుగా నిర్వహించాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు. ఎన్నికలు నిర్వహించాలని ఆదిలాబాద్ జిల్లా లేబర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. సరైన గుర్తింపు సంఘం లేకపోవడం కార్మికులకు పదోన్నతులు, బోనస్, గ్రేడింగ్‌లు కోల్పోయామని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ఎన్నికలు సజావుగా సాగాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.



రాములు నాయక్



సత్యపాల్ రావు



మారుతున్న రాజకీయ సమీకరణాలు...

గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచి గెలిపించిన కార్మిక సంఘం అధ్యక్షులు పుస్కూరి రామ్మోహన్‌రావు యూనియన్ ఈ సారి పోటీలో ఉండడం లేదని సమాచారం. కాంగ్రెస్ నుంచి మూడు బలమైన వర్గాలుగా విడిపోయి పోటీ పడు తున్నాయి. ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ ఈ 2131 యూనియన్ నుంచి కొక్కిరాల సత్యపాల్‌రావు బరిలో ఉండగా ఓరియంట్ సిమెంట్ పర్మినెంట్ వర్కర్స్ లోకల్ యూనియన్ ఈ2831 మాజీ ఎమ్మెల్సీ, మాజీ గుర్తింపు సంఘం అధ్యక్షుడు రాములు నాయక్ బరిలో ఉండబోతున్నారు.

అలాగే ఆదివాసీ నాయకత్వంలో ఇటీవల కొత్తగా ఏర్పడిన కార్మిక సంఘం లోకల్ ఓరియంట్ సిమెంట్ ఎంప్లాయిమెంట్ వర్కర్స్ యూనియన్ నుంచి పుస్కూరి విక్రమ్‌రావు పోటీలో ఉండనున్నట్లు యూనియన్ నాయకత్వం ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీలోని మూడు ప్రధాన వర్గాలు గా విడిపోయి పోటీపడడం ఇదే మొద టిసారి. అలాగే అదాని గ్రూపు ఆధ్వ ర్యంలో జరుగుతున్న మొద టి ఎన్నికలు కావ డం వల్ల కార్మికులతో పాటు ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది.

దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో మొదటిసారి వారసత్వ పోరు నెలకొంది. ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్‌కు దివంగత నేత మాజీ ఎంపీపీ కొక్కిరాల రఘుపతిరావు నాయకత్వం వహించి గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయ వంతం సాధించాడు. ఆ యూని య న్ తరుపున ఆయన చిన్న కొడు కు కొక్కిరాల సత్యపాల్‌రావు పోటీ పడు తూ తండ్రి వారసత్వాన్ని కొనసాగించాలని ఉవ్విళ్లూరుతున్నారు. అలాగే మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అండదండలతో

ఓరియంట్‌లో వారసత్వ పోరు..

పాటు స్థానికతను సద్వినియోగం చేసుకోవాలని ముందు నుంచే ప్రచారం కొనసాగిస్తు న్నాడు. గతంలో ఓరియంట్ సిమెంట్ కంపెనీలో మాజీ వైస్ ఎంపీపీ పుస్కూరి విక్రమ్‌రావు పెద్ద నాన్న దివంగతనేత పుస్కూరి వెంగల్ రావు పలుమార్లు గుర్తింపు సంఘం అధ్య క్షులుగా పని చేశారు. ఆయన వారసునిగా పని చేసి కంపెనీకి కార్మికుల కు పూర్వ వైభవం తీసుకువస్తానని హామీలు ఇస్తూ కార్మి కవర్గాన్ని ఆక ర్షిస్తు న్నాయి. ఇతనికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామితో పాటు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ మద్దతు ప్రక టించారు. దీంతో కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల రాజకీయ సమీకరణాలు రోజు రోజుకూ మారు తుండడంతో ఓరియంట్ కంపెనీ ఎన్నికలు ఉత్కంఠ రేపుతున్నాయి.



ఓరియంట్ సిమెంట్ కంపెనీ

వన సంపదకు రక్షణ ఏదీ..?

(3వ పేజీ తరువాయి)

అక్కడ చిరుతలు, పులుల సంచారం కూడా ఎక్కువగానే ఉంటుంది. క్వారీ గుట్టల్లో 2016లో ఉచ్చుకు చిరుతపులి చిక్కుకోగా, 2019 జనవరి 14న రంగంపేట సమీపంలో ఉచ్చులో చిరుత చిక్కి మృతి చెందింది. మృత్యువాతపడ్డ చిరుత రోజుల తరబడి అలాగే ఉండి, శరీరం కుళ్లిపోయే దశకు చేరుకున్నా అధికారుల దృష్టికి రాకపోవడం గమనార్హం.

ఎస్టీపీఎఫ్ ఏర్పాటుకు మోక్షం కలిగేనా...?

రాష్ట్రంలో వన్యప్రాణులు, ముఖ్యంగా పులుల రక్షణకు ప్రత్యేక సాయుధ దళాలను ఏర్పాటు చేయాలని 2019లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే "స్టేట్ టైగర్ ప్రొటెక్షన్ ఫోర్స్" (ఎస్టీపీఎఫ్) పేరిట ప్రత్యేక దళాలను రంగంలోకి దింపనున్నట్లు ప్రకటించింది. జంతువులను వేటాడితే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు వేటకు విద్యుత్ కంచెను ఉపయోగించే వారిపై కేసులు నమోదు చేయాలని నిర్ణయించింది. ఆ తరహా కేసులను సత్వరం విచారించి, నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకొనేందుకు ప్రణాళికలు రచించింది. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని కవ్వాల టైగర్ రిజర్వ్ ఫారెస్టులో పులులు, వన్య ప్రాణులకు రక్షణ కల్పించేందుకు 112 మంది సిబ్బందితో దళం ఏర్పాటు చేయాలని భావించింది. అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ నేతృత్వంలో ఈ సాయుధ ద ళం పని చేసేలా ఎస్టీపీఎఫ్‌కు రూపకల్పన చేసింది. ఇందులో ముగ్గురు ఫారెస్ట్ రేంజ్ అధికారులు, 81 మంది గార్డులు, 26 మంది ఫారెస్ట్ వాచర్లను ఏర్పాటు చేయనుండగా, ఈ సాయుధ దళ నిర్వహణ వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 శాతం చొప్పున భరించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే దాదాపు ఆరేళ్లు గడుస్తున్నా ఎస్టీపీఎఫ్ ఏర్పాటు చేయకపో వడంతో వన్యప్రాణులకు రక్షణ లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వమైనా కేంద్రంతో కలిసి ఎస్టీపీఎఫ్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సమాజ సేవలో తెలంగాణ జాగృతి ముందుంటుంది



మాట్లాడుతున్న తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకులు వెంకట్

మంచిర్యాలకలెక్టరేట్, మే30(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలు తెలం గాణ జాగృతి ముందుంటుందని ఆ సంఘం రాష్ట్ర నాయకులు వెంకట్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో తెలంగాణ జాగృతి సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత నేతృత్వంలో జిల్లాలో సామాజిక కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతాయన్నారు. కవిత నాయకత్వంలో తెలంగాణ జాగృతి సంస్థ కూడ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భువన చంద్ర, దుగుట శ్రీనివాస్, ప్రవీణ్, మేడి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ

జన్నారం,మే30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఈ నెల 1 నుంచి 10వ తేదీ వరకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవో విజయ్‌కుమార్ తెలిపారు. అన్ని పాఠశాలలకు యూనిఫాంలు 50శాతం కుట్టడం పూర్తయ్యాయని పాఠ శాలలు, ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలు తీసుకెళ్లాలని ఇప్పటికే సమాచారం ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అంబేద్కర్ ఫంక్షన్ హాల్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో, నాయకులు

స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవు

బెల్లంపల్లి, మే30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అంబేద్కర్ ఫంక్షన్‌హాల్ కోసం ఏర్పాటు చేసిన స్థలాన్ని కబ్జా చేస్తే చర్యలు తప్పవని ఆర్డీవో హరిక్రిష్ణ అన్నారు. శుక్రవారం అంబేద్కర్ ఫంక్షన్‌హాల్ స్థలాన్ని దళిత సంఘాల నాయకులతో కలిసి పరిశీలించారు. కొందరు వ్యక్తులు అంబేద్కర్ ఫంక్షన్ హాల్ ఆవరణలోని స్థలంలో ఇసుక, కంకర, ఇటుక వ్యాపారం చేస్తుండడంతో సదరు వ్యాపారులకు పిలిచి ఖాళీ చేయాలని సూచిం చారు. ఈ స్థలంలో ఎవరైన ప్రైవేటు వ్యక్తులు ఎలాంటి వ్యాపారాలు కొన సాగించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌ను వ్యాపారపరంగా వాడుకుంటున్నారని తన దృష్టికి వచ్చిందని విచారణ చేయగా నిజమే అని తేలడంతో కమ్యూనిటీహాల్‌కు తాళం వేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు కుంబాల రాజేశ్, మురళీ, రాజలింగు, కాంపెల్లి రాజం, కుమార్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలి

ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ అధ్యక్షుడు సత్యపాల్‌రావు

కాసిపేట, మే30 (ఆంధ్రజ్యోతి): ఓరియంట్ సిమెంట్ కంపెనీలో జరుగబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో సమర్థవంతమైన నాయకత్వాన్ని బలపరిచి గెలిపించుకోవాలని ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ అధ్యక్షులు కొక్కిరాల సత్యపాల్‌రావు అన్నారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో గెలిచిన గుర్తింపు సంఘం క్వార్టర్, కాంట్రాక్టు ఉద్యోగాలకు, స్కూల్లో సీటుకు ఒక్కోరేటు నిర్ణయించి అక్రమంగా సొమ్ము చేసుకున్నారన్నారు. కానీ ఇప్పటి నుంచి అవినీతి రహిత కార్మిక యూనియన్‌ను గెలిపించుకొని కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం పోరాడుదామని పిలుపునిచ్చారు. . ఈ సమావేశంలో స్థానిక గిరిజన సంఘాల నాయకులు అచ్యుత్‌రావు, జనార్ధన్, కొమ్ములబాపు, రాందాసు, ధర్ము, క్రిష్ణరావు, సత్తిరెడ్డి, శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షుడు సత్యపాల్‌రావు

నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

కలెక్టర్ కుమార్ దీపక్

కన్నెపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. శుక్రవారం కన్నెపల్లి మండలంలోని టేకులపల్లి గ్రామంలో నిర్మిస్తున్న నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణంతో పాటు గొల్లగట్టు, కన్నెపల్లి గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట తహ సీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో శంకర్, సిబ్బంది ఉన్నారు.

జైపూర్ : అర్హులైన ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శెట్‌పెల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలను కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. మండలంలో 582 మందికి మొదటి విడతలో ఇండ్లు మంజూరుచేశామన్నారు. ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీవో శ్రీపతి బాపురావు, కాంగ్రెస్ నాయకులు ఫయాజ్, శ్రీనివాస్‌రెడ్డి, విశ్వంభర్‌రెడ్డి, కిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

దండేపల్లి తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

దండేపల్లి,మే 30 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్‌గా రోహిత్ దేశ్‌పాండే శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో తహసీల్దార్‌గా పని చేసి దండేపల్లికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు విధులు నిర్వర్తించిన సంధ్యారాణి వేమనపల్లి మండలానికి బదిలీపై వెళ్లారు. డిప్యూటీ తహసీల్దార్ విజయ, సినియర్ అసిస్టెంట్ లావణ్య, ఆర్ఐ భూమన్న, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ఉపాధి పనుల పరిశీలన

మందమర్రిరూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పులి మడుగు గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ పనులను ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూలీలకు ఎక్కువ పనిదినాలు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు.

పారిశుధ్య పనుల పరిశీలన

మందమర్రిరూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపూర్ గ్రామపంచాయతీలో శుక్రవారం ఎంపీవో సత్యనారాయణ పారిశుధ్య పనులను పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరుగా సేకరించాలని, రోడ్లపై ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు లేకుండా చూసుకోవాలన్నారు. మురికి కాలువలను శుభ్రం చేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ ఉన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

లక్షెట్టిపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 3వ తేదీ నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని లక్షెట్టిపేట తహసీల్దార్ దిలీప్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల భూసమస్యల శాస్వత పరిష్కారానికి ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా ఈసదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన తేదీ నాడు ఉదయం నుంచి రైతు సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

కాసిపేట: జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ భోజన్న తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూభారతి చట్టంద్వారా రైతు భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు జూన్ 3 నుంచి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే ఆయా గ్రామాల్లో నిర్వహించిన తేదీల్లో దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. పట్టాపాసుపుస్తకంతో పాటు ఆధార్‌కార్డు, రిజిస్ట్రేషన్ డ్యాక్యుమెంట్లు, కోర్టు ఉత్తర్వుల కాగితాలతో హాజరుకావాలని సూచించారు.

చెన్నూరు : మండలంలో జూన్3వ తేదీ నుంచి 20 వరకు భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ మల్లికార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3నుంచి 20వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో గ్రామసభలు ఉంటాయన్నారు. భూసమస్యలున్న వారు సభల్లో దరఖాస్తులు అందజేయాలన్నారు.

హాజీపూర్: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా హాజీపూర్ మండలంలోని ప్రతి గ్రామంలో ఈ నెల 3 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించడానికి ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 నుంచి 18వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆయా గ్రామాల్లో నిర్వహించిన తేదీ నాడు అర్జీలను స్వీకరిస్తామని తెలిపారు.

నృత్య పోటీల్లో టెక్నో విద్యార్థుల ప్రతిభ

బెల్లంపల్లి, మే30 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో మునేశ్వరస్వామి ఆడిటోరియంలో ధూం డ్యాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించిన నృత్యపోటీల్లో టెక్నో డ్యాన్స్ అకాడమి విద్యార్థులు ప్రతిభచాటి బహుమతలు సాధించారు. జూనియర్ సోలో విభాగంలో ప్రథమ బహుమతి మహిమ, జూనియర్ డ్యూయేట్ విభాగంలో ప్రథమ బహుమతి ప్రణవ్, అనన్యలు, జూనియర్ గ్రూప్ విభాగంలో ప్రథమ బహుమతి, మెగా చాంపియన్‌షిప్ పోటీల్లో గెలుపొంది రూ.5 వేల నగదుతో పాటు బహుమతులు సాధించారు. విద్యార్థులను కోరియోగ్రాఫర్ మంతెన శివ, టెక్నో డ్యాన్స్ అకాడమి గ్రాండ్ మాస్టర్ హనుమాండ్ల మధూకర్, జిల్లా నృత్య కళాసమాఖ్య అధ్యక్షుడు సంతోష్‌లు అభినందించారు.

అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, మే30(ఆంధ్రజ్యోతి): వేమనపల్లి మండలంలోని చామనపల్లి గ్రామానికి చెందిన దళితరైతులపై అటవీశాఖ అధికారులు అక్రమ కేసులు నమోదు చేశారని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ 50ఏళ్లుగా చామనపల్లి శివారులోని సర్వే నెంబర్ 65, 67లో వివిధ పంటలు సాగు చేసుకున్నామన్నారు. సాగు చేస్తున్న భూమి అటవీ భూమి అని అటవీశాఖ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రైతులపై దాడులు చేస్తూ అక్రమంగా కేసులు నమోదు చేయించి జైలుకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులపై అక్రమ కేసులు పెట్టిన అటవీశాఖ అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హేమాజీ, నాయకులు కేశవరెడ్డి, రైతులు రాజయ్య, లింగయ్య, సతీష్, బానయ్యలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి మృతికి నివాళి



దండేపల్లిలో చంద్రమౌళికి నివాళులు అర్పిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

దండేపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): జన్నారం మండలం ఇందన్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఆసంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రజుల చంద్రమౌళి ఈనెల 28న గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతికి సంతాపంగా దండేపల్లిలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో కలిసి మౌనం పాటించి ఘనంగా నివాళ్లర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లుర్పించారు. ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శుల సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

కోటపల్లి : జన్నారం మండలంలోని ఇందన్‌పల్లి పంచాయతీ కార్యదర్శి చంద్రమౌళి ఈ నెల 28న గుండెపోటుతో మృతిచెందగా శుక్రవారం కోటపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. అధికారులు, పంచాయతీ కార్యదర్శులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీవో అక్తర్ మొహియోద్దీన్, ఏపీవో వెంకటేశ్వర్లు, కార్యదర్శులు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దండేపల్లి: మండలం కాసిపేట గ్రామానికి చెందిన హైమ్మద్ అనే బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త కూతురు పెళ్లి ఖర్చుల కోసం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు నడిపెల్లి విజిత్‌రావు రూ. 10వేల ఆర్థిక సాయం అందజేశారు. వీటిని శుక్ర వారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు అక్కల రవీందర్, ఆశెట్టి వెంకటరమణలు పెళ్లి కూతురు తండ్రి హైమ్మద్‌కు అందజేశారు.

దండేపల్లి: ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ప్రతి రైతు పచ్చిరొట్టె సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారులు కోరారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై వచ్చిన జనుము, జీలుగ విత్తనాలను దండేపల్లిలో వ్యవసాయశాఖ కార్యాల యంలో శుక్రవారం వివిధ గ్రామాలకు రైతులకు కూపన్లు అందజేశారు. కూపన్లు పొందిన రైతులకు ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం, నెల్కివెంకటాపూర్ వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ద్వారా పచ్చిరొట్ట విత్తనాల బస్తాలను అందజేశారు.

నెన్నెల : చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని నెన్నెల మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. బెల్లంపల్లి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో వారు వివేక్‌ను కలిశారు. మాజీ ఎంపీపీ తారాచంద్, నాయకులు ఉన్నారు.

●అంతర్జాతీయ యోగ దశాబ్ధి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనంలో యువతకు శుక్రవారం యోగాపై అవగాహన కల్పించారు. యోగాతో కలిగే ప్రయోజనాల గూర్చి వివరిస్తూ సాధన చేయించారు. శిక్షకులు మమత, ప్రదీప్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: ఐక్యతా, పోరాటం... సీఐటీయూ యూనియన్ లక్ష్యమని ఆ యూనియన్ ఏరియా అధ్యక్షుడు గుల్ల బాలాజీ పేర్కొన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ యూనియన్ కార్యాలయం వద్ద వేడుకలు నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY


ధాన్యం సేకరణలో జాప్యం

- నత్తనడకన సాగుతున్న కొనుగోళ్లు
- ప్రభుత్వ లక్ష్యం 56 వేల మెట్రిక్ టన్నులు
- కొనుగోలు చేసింది 8,260 మెట్రిక్ టన్నులు
- రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు

నైరుతి రుతుపవనాలు ఈ సారి ముందుగానే పలకరించనున్నాయి. త్వరలోనే రాష్ట్రంలో వానలు మొదలయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ చెబుతోంది. మరోవైపు అకాల వర్షాలు కురుస్తున్నాయి. యాసంగి ధాన్యం సేకరణ నత్తనడకన సాగుతుండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.



దహెగాం, మే 30 (ఆంధ్రజ్యోతి): యాసంగి ధాన్యం సేకరణ లక్ష్యం నత్తనకడన సాగుతోంది. మే నెలలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి మే 6వ తేదీ నుంచి ధాన్యం సంచులను రైస్ మిల్లులకు తరలించే ప్రక్రియ ప్రారంభించారు. యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 40 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. 56 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు కేవలం 8,260 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందులో 7,260 మెట్రిక్ టన్నుల ధాన్యం రైస్ మిల్లులకు పంపించారు. మరో 1000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉండిపోయింది. ఇప్పటి వరకు సన్నరకం 3,594 మెట్రిక్ టన్నలు, దొడ్డురకం 4,666 మెట్రిక్ టన్నుల ధాన్యం అధికారులు కొనుగోలు చేశారు. ప్రైవేటు వ్యాపారులు రైతు కళ్లల వద్దకు వెళ్లి తేమ శాతం, తాలు తరుగు తీయకుండా ప్రభుత్వ మద్దతు ధరకంటే తక్కువకే ధాన్యం కొను గోలు చేస్తు న్నారు. యాసంగి సీజన్‌లో సన్నాలకు రూ.500 బోనస్ ప్రకటించింది. బోనస్‌పై రైతులు ఆసక్తి చూపడం లేదు. తాలు పేరుతో కోతలు విధంచడం ఒక కారణమైతే ప్రభుత్వం రైతుల ఖాతాల్లో బోనస్ ఎప్పుడు జమ చేస్తుందో తెలియని పరిస్థితి, ఉంది. వర్షాకాలం సమీపించడంతో ప్రైవేటు వైపు మొగ్గు చూపుతున్నారు.

● జిల్లాలో 40 కొనుగోలు కేంద్రాలు..

జిల్లాలో యాసంగిలో ధాన్యం కొనుగోళ్లకు 40 కేంద్రాలు ఏర్పాటు చేశారు. కానీ కొన్ని కేంద్రాల్లోనే కొనుగోళ్ల చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులు రోజుల తరబడి అక్కడే పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. మరో వైపు ప్రస్తుతం కురుస్తన్న వర్షాలు రైతులను ఆందోళనకు గరి చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పెంచికలపేట, దహెగాం, కౌటాల మండలాల్లో ధాన్యం తడిసిపోయింది. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లతో ధాన్యాన్ని కంపి ఉంచినా అకాల వర్షాలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి.

● తక్కువ ధరకే దళారుల కొనుగోళ్లు..

ప్రభుత్వ మద్దతు ధర కన్నా తక్కువ ధరకే ప్రైవేటు వ్యాపారులు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. సన్నరకాలు క్వింటాలు రూ.2,000, దొడ్డు రకం రూ.1,700 నుంచి రూ.1,900 చెల్లించి క్వింటాలు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు కొనుగోలు చేసిన ధాన్యాన్ని స్థానిక మిల్లులతో పాటు మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలోని రైస్ బిల్లులకు తరలించి విక్రయిస్తున్నారు. జిల్లాలో 15 మండలాల్లో ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, వ్యవసాయ పంపు సెట్ల ద్వారా యాసంగి సీజన్‌లో 20,143 ఎకరాల్లో వరి పంటలను సాగు చేశారు. దహెగాం మండలంలో అత్యధికంగా 7,956 ఎకరాల్లో వరి సాగు చేశారు. దహెగాం మండలంలో సన్నరకం, దొడ్డురకం ధాన్యంతో పాటు విత్తనోత్పత్తి వరి, విత్తన వరిని రైతులు సాగు చేశారు. గత గురువారం నుంచి కొనుగోలు చేసి ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించే ప్రక్రియలో స్థానిక మిలులకు సన్నరకం ధాన్యాన్ని పంపించారు. దొడ్డురకం పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్ పరిధిలోని బాయిల్డ్ రైస్ మిల్లుకు పంపిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

సన్నరకాలు సాగు చేశాం..
- పొన్న వెంకన్న, రైతు, హత్తిని



బీపీటీ సన్నరకాల వరిని సాగు చేశాం. ఎనిమిది ఎకరాల వరి పొలం కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేశారు. 137 క్వింటాళ్ల ఇప్పటికే ప్రైవేటు వ్యాపారులకు విక్రయించాను. మరో 60 క్వింటాల్ల సన్న రకం ధాన్యం ఉంది. వర్షాలు ఇబ్బంది పెడుతుంటే వర్షాకాలం వచ్చింది. బోనస్ ఎప్పుడు వస్తుందో తెలియకనే ప్రైవేటుకు ధాన్యం విక్రయించాను.

వర్షాలతో ఇబ్బందులు..
- వెంకట్‌రెడ్డి, రైతు, దహెగాం



అకాల వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం కాపాడు కోవడం ఇబ్బంది పడుతున్నాం. టార్పాలిన్లు కప్పి ధాన్యం కాపాడుకుంటున్నాం. వర్షాకాలం సమీపిం చినందునా ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలి. రో జుల తరబడి కాంటా చేయక పోవడంతో అవస్థలు పడుతున్నాం. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

బీఆర్ఎస్‌ను బలోపేతం చేయాలి



పెళ్లి కార్డు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జైనూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు ప్రజల్లోకి వెళుతూ బీఆర్ఎస్‌ను బలోపేతం చేయలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మండలంలోని బీఆర్ఎస్ నాయకులు పార్టీ మండల అధ్యక్షుడితో కలిసి శుక్రవారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలోనే గ్రామీణ ప్రాంత ప్రజలకు న్యాయం జరిగిందన్నారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుడు సోనకాంబ్లే సిద్ధార్థ్ వివాహ వేడుకలకు హాజరు కావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం అందజేశారు. కార్యాక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఇంతీయాజ్ లాల, సీనియర్ నాయకుడు. మాజీ సర్పంచ్ మడావి భీంరావ్, ఆత్రం లక్ష్మణ్ , కాంబ్లే బబ్రువాన్, షేక్ బాబ, పోరకాంబ్లే రాంకిషన్, ఉప సర్పంచ్ డొంగ్రే సమాధాన్, ససానె సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఏడీఏ మనోహర్

సిర్పూర్(టి), మే 30 (ఆంధ్రజ్యోతి): ఎరువులు దుకాణాల యజమానులు నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఏడీఏ మనోహర్ అన్నారు. మండలంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణంలో ఏఏ విత్తనాలు ఉన్నాయో నోటీసు బోర్డుపై రాయాలని, అలాగే ధరల పట్టిక, స్టాక్ వివరాలు, రిజిస్టర్లను నమోదు చేయాలన్నారు. రైతుల నుంచి ఆధార్ కార్డు నెంబర్ తీసుకుని విత్తనాలతో పాటు రశీదులు ఇవ్వాలన్నారు. అనంతరం జీలుగు విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో గిరీష్‌కుమార్, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యవర్గం



ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యవర్గం

రెబ్బెన, మే 30 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. చీఫ్ ప్యాట్రన్లుగా ఆర్ నారాయణరెడ్డి(గోలేటి), జగన్నాథం(బెల్లంపల్లి), వి ప్రతాప్(మంచిర్యాల), భీమ్లానాయక్(బెజ్జూరు), అధ్యక్షుడిగా డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్(కాగజ్‌నగర్), వైస్ ప్రసిడెంట్లుగా భాస్కర్(గోలేటి), గోవర్ధన్‌రెడ్డి(ఆదిలాబాద్), ఈశ్వర్(నిర్మల్), మహేందర్(గోలేటి), శృతి(బెల్లంపల్లి) ఎన్నికయ్యారు. జనరల్ సెక్రటరీగా ఎస్ తిరుపతి(గోలేటి), ట్రేజరర్‌గా యుశంకర్(మంచిర్యాల), జాయింట్ సెక్రటరీలుగా ఎంవెంకటేశ్వర్లు(గోలేటి), గోపాల్(శ్రీరాంపూర్), సాంబశివరావు(కాగజ్‌నగర్), హరిలాల్(గోలేటి), సరిత(కౌటాల), ఆర్గనైజింగ్ సెక్రటరిగా పిబానయ్య(మందమర్రి) ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆసిఫాబాద్‌రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మం డలం బూరుగూడలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మంలంలోని చిలాటిగూడకు చెందిన జిమ్నాజి(45) తన కూతురు వెన్నెల, అల్లుడు సోనులను బైక్‌పై ఆసిఫాబాద్ నుంచి గ్రామానికి తీసుకెళుతున్నాడు. బూరుగూడ సమీపంలో యూటర్న్ వద్ద రోడ్డు దాటుతుండగా మంచిర్యాల నుంచి మహారాష్ట్ర వెళ్తున్న స్కార్పియో వాహనం ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న జిమ్నాజి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. కూతురు వెన్నెల, అల్లుడు సోనులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో వారిని ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బెజ్జూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌వో అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో ఇంగ్లీష్ మీడయంలో 20, ఇంటర్ ఫస్ట్‌యర్ సీఈసీలో 30 సీట్లు, ఎంపీహెచ్‌డబ్ల్యూలో 30 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

నేటి నుంచి జొన్న కొనుగోళ్లు నిలిపివేత

జైనూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో కొనసాతున్న జొన్నల కొనుగోలు ప్రక్రియ శనివారంతో నిలిపివేస్తున్నామని మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనతలో తెలిపారు. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు కొనుగోలు నిలిపి వేశామని, రైతులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

కెరమెరి, మే 30 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే గిరిజనులు అభివృద్ధి చెందుతారని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు భరత్ అన్నారు. మండలంలోని పాటగూడ, బాబేఝరి, పిట్టగూడ, గోండుగూడ, పాట్నాపూర్ గ్రామాలను శుక్రవారం ఆయన సందర్శించారు. పదోవ తరగతి పాసైన విద్యార్థులకు ఐటీఐ, ఇంటర్, తదితర కోర్సుల గురించి వివరించారు. ఇటీవల నిర్వహించిన గురుకుల కౌన్సెలింగ్‌లో హాజరు కాని విద్యార్థుల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఇంట్లో ఖాళీగా ఉండకుండా ఉన్నత చదువులపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆయన వెంట మోతిరాం, శ్రీనివాస్, సంజీవ్, భీంరావు, టి భీంరావు తదితరులు ఉన్నారు.

ఇందానిలో వైద్య శిబిరం

వాంకిడి, మే 30 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలోని ఇందాని గ్రామంలో శుక్రవారం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి జ్వరాలతో బాధపడుతున్న పలువురికి రక్తన మూనాలను సేకరించి మందులు పంపిణీ చేశారు. వర్షకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దోమలు అరికట్టాలని తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో రవిదాస్, సిబ్బంది మమత, కాంత, భగవాన్‌దాస్, కార్యదర్శి దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి



డీఆర్డీవో దత్తారావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీలకు కనీస వసరతులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నా వద్దకు వచ్చిన డీఆర్డీవో పీడీ దత్తారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. పని దినాలు కూలీలకు పెంచాలని, జాబ్ కార్డు లేని వారికి జాబ్ కార్డులు ఇవ్వాలని తదితర డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, కింది స్థాయి అధికారులపై ఇప్పటికే మెమోలు జారీ చేశామని, నిర్లక్ష్యం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్డీవో పీడీ దత్తారావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు దినకర్, టీకానంద్, కార్తీక్, అశోక్, శ్రీనివాస్, బక్కయ్య, తిరుపతి, శ్రీకాంత్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం చేయాలి

కెరమెరి, మే 30 (ఆంధ్రజ్యోతి): వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం చే యాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. అంతాపూర్ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన నర్సరీని శుక్రవారం ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీ మొక్కలను షిఫ్టింగ్, గ్రౌండింగ్ చేయాలన్నారు. మొక్కలు ఎండి పోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లక్ష్యం మేరకు మొక్కలకు సకాలంలో సిద్ధం చేసి అందిచాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. జనన, మరణ ధ్రువీకరణ రికార్డులు సైతం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం అక్కడి గ్రామ పంచాయతీ భవనం నూతనంగా రూ. 22 లక్షలతో నిర్మిస్తున్నందున భవనాన్ని పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపడుతూ సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకురాలు రమాదేవి

ఆసిఫాబాద్‌రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలను పాఠశా లల్లో చేర్పించాలని గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకురాలు ఆర్ రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని పీఎంహెచ్ గర్ల్స్ వసతి గృహంలో శుక్రవారం ఆ శాఖ ప్రధానోపాధ్యాయులు, సంక్షేమా ధికారులు, ఎస్‌సీఆర్పీలు, పీఎంఆర్పీ సిబ్బంది, ఏటీడీఓలకు జూన్ 6 నుంచి నిర్వహించనున్న బడిబాట కార్యక్రమంలో భాగంగా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ ఐటీడీఏ పీవో కుష్భూగుప్తా, గిరిజన సంక్షేమ సంచాలకుల ఆదేశాల మేరకు విడుదలైన జయశంకర్ బడిబాటలో జూన్ 6 నుంచి 19 వరకు ఉపాధ్యాయు లందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్దవ్, సహయ గిరిజన సంక్షేమాధికారులు చిరంజీవి, కమర్ హుస్సేన్, శ్రీనివాస్, జీసీడీవో శకుంతల, స్పోర్ట్స్ ఆఫీర్ మీనారెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్పీఎంలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

కాగజ్‌నగర్ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలని శుక్రవారం వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ ఆధ్వర్యంలో కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్‌కు తన కార్యాలయంలో వినతిపత్రం అందించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియ ప్రారంభించి నిలిపివేశారని గుర్తు చేశారు. గత 2024 నవంబర్‌లో అన్ని సంఘాల ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో సమావేశం ఏర్పాటు చేశారన్నారు. కార్మిక సంఘాలు వివరాలు అందించి 7 నెలలు కావస్తున్న ఎన్నికలపై ఎలాంటి స్పందని లేదని చెప్పారు. ఎన్నికలు లేకపోవడంతో కార్మికుల్లో అభద్రత భావం నెలకొందని, వెంటనే ఎన్నికల ప్రక్రియ వేగవంతం చేయాలని వినతి పత్రంలో కోరామని తెలిపారు. కార్యక్రమంలో మిల్లు మజ్దూర్ యూనియ న్ జనరల్ సెక్రెటరీ కూశన రాజన్న, వెస్ ప్రెసిడెంట్ ముంజం శ్రీనివాస్, రాజేందర్, శ్రీకాంత్, కృష్ణహరి పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారులను అడ్డుకున్న పోడు రైతులు



రైతులతో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

పెంచికలపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు రేంజ్ పరిధిలోని జైహింద్ పూర్ గ్రామ శివారులో అటవీ ప్రాంతంలో అటవీ శాఖాధికారులు మొక్కలు నాటేందుకు చదును చేయడానికి వెళ్లగా పోడు రైతులు అడ్డుకున్నారు. బెజ్జూరు ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో శ్రావణ్‌కు మార్ శుక్రవారం తన సిబ్బందితో కలిసి రైతులు పోడు సాగు చేసుకుంటున్న భూముల్లో మొక్కలు నాటేందుకు ట్రాక్టర్లతో పనులు ప్రారంభించారు. విషయం తెలిసిన రైతులు మొక్కలు నాటే కార్యక్రమం పేరుతో తమ భూములను స్వాధీనం చేసుకోవద్దని వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో అటవీ శాఖ అధికారులకు పోడు రైతులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామని, ముందుగా మంచే నిర్మిస్తామని అటవీ అధికారులు రైతులకు వివరించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను వదులుకోమని పోడు రైతులు భీష్మించుకుని కూర్చున్నారు. తాము అక్కడి నుంచి వెళితే పనులు చేపడుతారని రాత్రి వరకు అక్కడే బైఠాయించారు.

వారసంత పునఃప్రారంభించాలి



గోయగాం గ్రామం

కెరమెరి, మే 30 (ఆంధ్రజ్యోతి): గోయగాం గ్రామంలో 15 ఏళ్ల క్రితం వరకు కొనసాగిన వారసంతను తిరిగి పునఃప్రారంభించాలని గోయగాం గ్రామ సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కెరమెరి మండలంలో ఒకే ఒక వార సంత అది కెరమెరిలో ఉండడం వల్ల గోయగాం వారసంత తిరిగి పునఃప్రారంభిం చాలని గ్రామస్థులు కోరుతున్నారు. గతంలో ఈ గ్రామంలో మంగళవారం వారసంత కొనసాగేది. వారసంతకు జైనూరు, కెరమెరి, ఆసిఫాబాద్ తదితర పట్టణాలకు చెందిన వ్యాపారులు వచ్చే వారు. కూరగాయలు, ఆలు, ఉల్లిగడ్డలు, వెల్లులి, కిరాణ, మసాల దినుసులతో పాటు పలు రకాల దుకాణాలు వెలిసేవి. ఈ వార సంతకు సావర్‌ఖేడ, భీమన్‌గొంది, ధనోర, కోటారి, రింగన్‌ఘాట్, కల్లెగాం, పిట్టగూడ, పిప్రి, అంబారావుగూడ, రాంనగర్, ఇందాపూర్, గోండ్‌గూడ, ఉమ్రి, దేవుడుపల్లితో పాటు ఆసిఫాబాద్ మండలంలోని వాడిగూడ, అడ గ్రామస్థులకు ఉపయోకరంగా ఉంటుందని చెబుతున్నారు. గతంలో ప్రతి మంగళవారం వార సంత కొనసాగేది. కుమరం భీం ప్రాజెక్టు కావడంతో కొన్ని గ్రామాలకు ముంపునకు గురి కావడం, మరికొన్ని గ్రామాల వారి మధ్యలో నీరు ఉండడంతో వార సంతకు వచ్చ ప్రజల సంఖ్య తగ్గి పోయింది. దీంతో వ్యాపారులు సైతం రాకుండా పోయారు. గోయగాం గ్రామం ఆసిఫాబాద్- ఆదిలాబాద్ ప్రధాన రహదారిపై ఉండడం వల్ల తిరిగి ఇక్కడే వారసంత ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.